క్లుప్తంగా

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు


స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆశీనులను చేసి కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

డాక్టర్ జాన్ సుధాకర్‌కు కన్నీటి వీడ్కోలు


డాక్టర్ సుధాకర్ భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రముఖులు

పెందుర్తి: 120 డిగ్రీలతో ప్రపంచ రికార్డు సృష్టికర్త, ప్రసారశాఖ మాజీ అడిషనల్ డైరెక్టర్ జనరల్, సీనియర్ పాత్రికేయుడు పట్నాల జె.సుధాకర్ అంత్యక్రియలు ముగిసాయి. అనారోగ్యంతో బుధవారం నగరంలో కన్నుమూసిన ఆయన భౌతికకాయాన్ని చినముషిడివాడలోని స్వగృహానికి తరలించారు. గురువారం ఉదయం పలువురు సీనియర్ పాత్రికేయులు, ప్రముఖులు సుధాకర్ భౌతికకాయం వద్ద ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు, అభిమానులు నడుమ అంతిమయాత్ర నిర్వహించారు. చినముషిడివాడ శ్మశానవాటికలో డాక్టర్ సుధాకర్ అంత్యక్రియలు చేశారు. దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ ఎస్.వి రమణ, ఐడీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు టి.నానాజీ, పీవోడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రోహిణి తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా పోటీలకు ముగ్గురి ఎంపిక

పరవాడ: చీరాలలో ఈ నెల 9,10,11 తేదీల్లో జరగనున్న అంతర్ జిల్లా అథ్లెటిక్స్ పోటీలకు పరవాడ నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. సింహాద్రి ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల భారతి పబ్లిక్ పాఠశాలలో చదువుతున్న శరణ్యారెడ్డి (ట్రయాథ్లాన్), బి.సంధ్యారాణి (60 మీటర్ల పరుగు పందెం), ధన హర్షిణి (షార్ట్ పుట్) మండలం నుంచి ప్రాతినిధ్యం వహిస్తారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వాసంతీదేవి, కోచ్ షిల్లన్ జేమ్స్ తదితరులు వారిని అభినందించారు.

వర్షం.. రైతుల హర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం


పోలీస్‌స్టేషన్‌లో భారీగా చేరిన వర్షపు నీరు


సబ్బవరం శివాలయం సమీపంలో వర్షం నీటిలోనే ప్రయాణిస్తున్న వాహనాలు

సబ్బవరం: మండలంలో గురువారం మధ్యాహ్నం ఒక మోస్తరు నుండి భారీ వర్షం కురిసింది. దీంతో మండల కేంద్రంలోని రోడ్లన్నీ జలమయం అయ్యా యి. సబ్బవరం పోలీస్ స్టేషన్ సమీపంలోని లోతట్టు ప్రాంతంలోని ప్రధాన రహదారిపై భారీగా నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అవరోధం ఏర్పడింది. అదే విధంగా సబ్బవరం పోలీస్ స్టేషన్ పూర్తిగా నీట మునిగిపోయి ఇబ్బందులు తలెత్తాయి. సబ్బవరం గ్రామీణ ప్రాంతంలోను వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వరి నారుమడులకు, పూతదశలో ఉన్న గంటి చేలకు ఈ వర్షం ఎంతో ఉపయోగకరమని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు


సూపరింటెండెంట్‌కి, సీనియర్ అసిస్టెంట్‌కి చెక్కు అందజేస్తున్న దాత ఈశ్వరరావు


సూపరింటెండెంట్‌కు చెక్కు అందజేస్తున్న దాత మనవలయ్య

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం నగరంలోని పెదగంట్యాడకు చెందిన సంపంగి ఈశ్వరరావు రూ. లక్ష విరాళం అందజేశారు. సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయంలో చెక్కుని ప్రోటోకాల్ విభాగం సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

చినవాల్తేరు దాత విరాళం రూ. లక్ష..

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం నగరంలోని చినవాల్తేరుకు చెందిన ఆర్.వి. మనవలయ్య అనే దాత రూ. లక్ష 116 విరాళం సూపరింటెండెంట్ పాలూరు నరసింగరావుకి అందజేశారు. దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఘన నివాళి


ఠాగూర్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయుల నివాళి

పెందుర్తి: రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి సందర్భంగా పురుషోత్తపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆయనకు ఘన నివాళి అర్పించారు. హెచ్‌ఎం చిరికి శ్రీనివాసరావు చేతుల మీదుగా రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. దేశానికి ఆయన అందించిన సేవలను విద్యార్థులకు శ్రీనివాసరావు వివరించారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

పెందుర్తి:

ఉత్తరాంధ్రలో పార్టీ బలోపేతానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉత్తరాంధ్ర జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే, పెందుర్తి సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. పార్టీ యువజన విభాగం బలోపేతానికి క్షేత్రస్థాయిలో పని చేస్తామని పేర్కొన్నారు.


అధినేత జగన్‌తో అదీప్‌రాజ్

తల్లిపాలతోనే చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం

సబ్బవరం: తల్లిపాలు చిన్నారులకు అమృతంతో సమానమని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. సబ్బవరంలోని స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గర్భస్థ దశలో తల్లి తీసుకునే ఆహారం మీదే శిశువుల ఆరోగ్యం ఆధార పడి ఉంటుందన్నారు. అనంతరం గర్భిణులకు ఐసీడీఎస్ అధికారులు సామూహిక సీమంతాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యకుమారి, ఎంపీపీ బోకం సూర్యకుమారి, వైస్ ఎంపీపీలు దాడి ఝాన్సీ లక్ష్మీరాణి, మామిడి లక్ష్మి, సీడీపీవో లలిత కుమారి, ఇన్‌చార్జి ఎంపీడీవో శివప్రసాద్ నారాయణ, ఈవోపీఆర్‌డీ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహార కిట్ల వితరణ


కిట్లు అందిస్తున్న కోరమాండల్ సంస్థ అధికారులు, స్థానిక నాయకులు

మల్కాపురం: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా 58వ వార్డు కోడిపందాలదిబ్బ ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ సీఎస్సార్ హెడ్ వెంకటరమణ, స్థానిక నాయకులు కోరాడ శ్రీనివాస్, పాతబత్తుల శ్రీను తదితరులు కిట్లు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సుమారు 90 మంది గర్భిణులకు కిట్లు అందించినట్లు తెలిపారు. గర్భిణులు ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వాలనే సంకల్పంతో కోరమాండల్ సంస్థ సీఎస్సార్ నిధుల నుంచి పౌష్టికాహారం అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గొందేశి రాజేష్‌రెడ్డి, వాతాడ సుజాత, డాక్టర్ ఉదయ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

పరవాడ: స్థానిక బీసీ కాలనీలోని మండల పరిషత్ పాఠశాలలో చదువుతున్న 110 మంది విద్యార్థులకు దివంగత కూండ్రపు అప్పలనాయుడు మాస్టారి కుమారుడు నరసింహమూర్తి నోట్ పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి సమకూర్చారు. గురువారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, పార్టీ జిల్లా సీనియర్ నేత, మాజీ సర్పంచ్ చుక్కా రామునాయుడు, ఎంఈవో–1,2 దివాకర్, సాయి శైలజ చేతుల మీదుగా సామగ్రిని అందించారు. నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పైలా టీవీ అప్పారావు, బొద్దపు చిన్నారావు, పైలా రాధాకృష్ణ, వర్రి హరి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న శ్రీనివాసరావు, రామునాయుడు

స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు


డాక్‌యార్డ్ గొడౌన్స్ వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

మల్కాపురం: ప్రజల ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దే వద్దని సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. అదానీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా గురువారం డాక్‌యార్డ్ సమీపాన గొడౌన్స్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ మల్కాపురం జోన్ నాయకుడు పైడిరాజు మాట్లాడుతూ ఇప్పటికే పెరిగిన విద్యుత్ చార్జీల వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలను మరిన్ని ఆర్థిక ఇబ్బందులకు గురి చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతుల సమస్యలపై దృష్టి సారించాలి

సబ్బవరం: మండలంలోని అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారి విస్తరణ, విశాఖ–రాయపూర్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా రైతులకు ఏర్పడిన సమస్యలపై జాతీయ రహదారుల విస్తరణ అధికారులతో స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు గురువారం చర్చించారు. మండంలోని చిన్నయ్యపాలెం వద్ద విస్తరించిన జాతీయ రహదారిని జాతీయ రహదారుల భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణితో కలిసి పరిశీలించారు. తమ నియోజకవర్గ పరిధిలో జాతీయ రహదారులు విస్తరించడంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభాత్ రంజన్, సైట్ ఇంజినీర్లు పవన్‌కుమార్ రిచర్డ్, సబ్బవరం తహసీల్దార్ బి. చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణితో చర్చిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

సింహాచలం ఈవోకు కృతజ్ఞతలు

సింహాచలం: సింహగిరిపై పెళ్లిళ్లకు డెకరేషన్ మండపాల కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసినందుకు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావుకు వీహెచ్‌పీ, సామాజిక సమరసత అభియాన్ నేతలు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. అలాగే గతంలో తాము సూచించిన కొన్ని అంశాలు కూడా పరిగణనలోకి తీసుకుని 9,500కే ఒక పెళ్లికి కావాల్సిన సామగ్రి అందించే ప్రక్రియను పరిశీలించాల్సిందిగా కోరారు. ఈవోని కలిసిన వారిలో వీహెచ్‌పీ నేత పూడిపెద్ది శర్మ, సామాజిక సమ సమరసేత అభయాన్ జిల్లా ప్రముఖ్ మీసాల రవీంద్ర, సింహాచలం ప్రఖండ అధ్యక్షుడు కాళ్ల జగన్ తదితరులు ఉన్నారు.


ఈవోను సత్కరిస్తున్న పలు సంస్థల నేతలు

భైరవస్వామి హుండీలో నగదు చోరీ


తాళాలు తొలగించి ఉన్న హుండీలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన భైరవవాకలోని భైరవస్వామి ఆలయంలో రెండు హుండీల తాళాలు విరగ్గొట్టి నగదు చోరీ చేసిన సంఘటన గురువారం ఉదయం వెలుగు చూసింది. దేవస్థానం అధికారుల ఫిర్యాదుతో గోపాలపట్నం క్రైమ్ పోలీసులు విచారిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గురువారం ఉదయం 6 గంటలకు తొలి షిఫ్టులో పనిచేసే సెక్యూరిటీ గార్డుతో కలిసి వెళ్లి ఆలయ తలుపులు తెరచిన అర్చకుడు సంతోష్‌శర్మ ఆలయంలో ఉన్న రెండు స్టీల్ హుండీల తాళాలు విరగ్గొట్టి ఉండటాన్ని గమనించారు. పక్కనే త్రిశూలం పడి ఉండటాన్ని చూశారు. దీంతో దేవస్థానం అధికారులకు సమాచారం అందించారు. గోపాలపట్నం క్రైమ్ పోలీసులకు దేవస్థానం అధికారులు ఫిర్యాదు చేశారు.

ఆలయం వద్దకు వచ్చిన క్రైమ్ ఎస్ఐ తేజేశ్వరరావు అంతా పరిశీలించారు. వేసిన ఆలయం తలుపులు వేసినట్టే ఉండటం, ఆలయంపై నుంచి ఎంత వరకు దొంగలు కిందకు దిగే అవకాశం ఉంది, త్రిశూలంతోనే హుండీల తాళాలు విరగకొట్టి ఉండవచ్చా.. తదితర విషయాలను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గడిచిన రెండు నెలల నుంచి హుండీలను తెరవలేదు. హుండీల్లో రూ. 2 వేల వరకు ఉండవచ్చని భావిస్తున్నారు.